

# హైదరాబాద్ వార్త


# ఒక్కో కార్పొరేషన్‌కు 500కోట్లు

**-సైబరాబాద్, మల్కాజ్‌గిరిలకు ప్రత్యేకంగా కేటాయింపు**
**-ప్రతి కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా.. చట్టబద్ధ హక్కులు**
**-రెండు మున్సిపల్ కార్పొరేషన్లకు సరిపడా సిబ్బంది**
**-జయేష్ రంజన్ అధ్యక్షతన జిహెచ్ఎంసి తొలి స్టాండింగ్ కమిటీ మీటింగ్**
**-ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన కమిటీ**




**హైదరాబాద్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ అనంతరం తొలి సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక అధికారి జయేష్‌రంజన్ అధ్యక్షతన మొట్టమొదటి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. దీనికి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తోపాటు వివిధ విభాగాల అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు హాజరయ్యారు. ఈసమావేశంలో ప్రధానంగా మూడు ఎజెండా అంశాలపై చర్చించారు. కోర్ అర్బన్ రీజియన్ పునర్వ్యవస్థీకరణ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, జిహెచ్ఎంసి మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఏర్పాటు, శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు జీహెచ్ఎంసీ పరిధిలో కొనసాగింపు. ప్రతి కార్పొరేషన్‌కు ప్రత్యేక కార్పొరేట్ హోదా, చట్టబద్ధ హక్కులు, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు సిబ్బంది కేటాయింపు. సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు తలా రూ.500 కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయింపు వంటి మూడు ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ అమోదం తెలిపింది. అనంతరం పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, డంపింగ్ యార్డులు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు, వాటర్ లాగింగ్ పాయింట్‌లు, మౌలిక సదుపాయాలు, కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లకు సిబ్బంది కేటాయింపు, మాన్ సూన్ సన్నద్ధత, వీధి లైట్ల పనితీరు, పబ్లిక్ గ్రీవెన్స్, రోడ్ సెఫ్టీ డ్రైవ్‌వంటి పనుల పురోగతిపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం జయేష్ రంజన్ కమిషనర్, అదనపు కమిషనర్‌లు, జోనల్ కమిషనర్‌లు, విభాగాల ఉన్నతాధికారులకు నగరంలో పౌర సేవలను మరింత మెరుగుపరిచేందుకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు దిశా నిర్దేశం చేశారు. క్యూర్ పరిదిలోని మూడు కార్పొరేషన్‌ల నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు లభించిన గొప్ప అవకాశంగా అధికారులు భావించాలని చెప్పారు. రానున్న 6 నెలల్లో ఎస్ఆర్‌డిపి, ఎస్ఎన్‌డిపి, హెచ్- సిటీ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వేగంగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

**సీజీజీ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్..**

జీహెచ్ఎంసీ మూడు కార్పొరేషన్‌గా పునర్వ్యవస్థీకరణ అయిన నేపథ్యంలో అస్సెట్, లయబిలిటీలు, మ్యాన్‌పవర్‌ను తాత్కాలికంగా మూడు కార్పొరేషన్ లకు కేటాయించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు జయేష్ రంజన్ తెలిపారు. కేటాయింపులు, ఒప్పందాలు వంటిప్రతి అంశాన్ని క్షుణ్ణంగా స్టడీ చేసి శాస్త్రీయంగా కేటాయింపులు చేయనుందని తెలిపారు. కొన్ని శాఖల్లో మంచి పనితీరు కనబరిచిన ఫలితాలు రావాలంటే కొంత కాలం వేచి చూడాల్సి వస్తుందన్నారు. కార్పొరేషన్ లోచక్కగా పనిచేస్తే విజిబుల్ ఇంపాక్ట్ ఉంటుందన్నారు. అర్బన్ గవర్నెన్స్‌లో మార్పు తెచ్చేందుకు ఆరు నెలలు సమయం సరిపోతుందని సిఎం రేవంత్ రెడ్డి క్యూర్ ఏరియాలో సుపరిపాలన అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అలాగే కమిషనర్ ఆర్.వి.కర్ణన్ గురించి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ గా సంవత్సర కాలంగా పనిచేస్తూ జిహెచ్ఎంసిలో పురపాలికల విలీనం, పునర్వ్యవస్థీకరణ, మూడు కార్పొరేషన్ల ఏర్పాటు వంటి క్లిష్ట అంశాలను తనదైన నేర్పుతో సులభంగా చేశారని భవిష్యత్‌లోనూ మంచి ఫలితాలను సాధించాలని సూచించారు.

**పారిశుద్ధ్య పోటీలు...ప్రోత్సాహకాలు..**

పారిశుద్ధం మరింత మెరుగుపరిచేందుకు మూడు కార్పొరేషన్లకు పారిశుద్ధం అంశంలో పోటీలను నిర్వహించనున్నట్లు జయేషన్‌రంజన్ తెలిపారు. గార్బేజి వల్నరబుల్ పాయింట్ లేని వార్డులు, సర్కిల్, కార్పొరేషన్లను తీర్చిదిద్దిన అధికారులకు ప్రశంస పత్రాలు, ఆర్థిక నగదు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంశాల్లో క్రియాశీలక భాగస్వామ్యమైన కార్పొరేటర్లు, ఎన్జీవోలు, అధికారులు, వ్యక్తులకు కూడా ప్రశంస పత్రాలు అందిస్తామన్నారు. ఈసమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్‌లు కే ఏ మంగతాయారు, కే సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, ప్రియాంక అల, ఎన్. రవి కిరణ్, ఎస్ శ్రీనివాసరెడ్డి , జి.ముకుంద రెడ్డి , జలమం డలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, ఈడిఎన్ స్ట్రామాట్ అశోక్, చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, సిసిపి కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నత్తనడకన ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు




వివిధ దశలలో కొనసాగుతున్న ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ఆధునీకరణ

- గడువుదాటినా పూర్తికాని వైనం



**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో భాగంగా పాత బస్తీలోని ఉప్పుగూడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి (ఆధునీకరణ) పనులు నత్త నడకన సాగుతున్నాయి. 2023, ఆగస్టు 6న దేశ వ్యాప్తంగా చేపట్టిన మొదటి విడత 21 రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులను భారత ప్రధాని నరేంద్రమోది, సుమారు రూ.26.81 కోట్లతో చేపట్టిన ఉప్పుగూడ రైల్వే స్టేషన్లో పనులకు కిన్నెర మొగిలయ్య, అప్పటి గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మిలు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి శంఖుస్థాపన చేశారు. పునరాభివృద్ధి పనులు డిసెంబర్, 2025లోగా పూర్తి కావాల్సి ఉంది. అయితే పనులు గత 30 నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్, బేగంపేట అమృత్ స్టేషన్లను అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సికింద్రాబాద్-ఫలక్‌నుమా స్టేషన్‌ల మధ్య, కాచిగూడ సెక్షన్ లోని సబర్బన్ గ్రేడ్3 స్టేషన్. ఈ స్టేషన్ నుండి సబర్బన్, ఎంఎంటీఎస్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు 50కి పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. రోజు ఐదు వేలకు పైగా ప్రయాణికులు నగరంలోని పలు ప్రాంతాలకు, ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు ఉపాధి, విద్య, వ్యాపారం, ఉద్యోగం కోసం రాకపోకలు సాగిస్తుంటారు. పునరాభివృద్ధిలో భాగంగా ప్రవేశ ముఖద్వారం, రెండవ ప్రవేశ ద్వారం, స్టేషన్ భవనం, ఆవరణ అభివృద్ధి, 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెండు ప్యాసింజర్ లిఫ్టులు, రెండు ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలను అభివృద్ధి పర్చటం, అదనపు పై కప్పులు నిర్మించటం, కాన్కోర్స్, ప్రయాణికుల నిరీక్షణ గదుల లోపల పునరుద్ధరణ, దివ్యాంగులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, కొత్త సూచిక బోర్డులు, నూతన పనులు చేపట్టాలి. ఇందులో వెయిటింగ్ హాలు అభివృద్ధి, 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి గర్డర్లు, మరికొన్ని పనులు పూర్తికాగా పార్కింగ్ షెడ్లు, ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. ఇంకా అనేక పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నిబంధనల ప్రకారం అన్ని పనులు పూర్తి కావాలంటే మరో రెండు, మూడు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ రైల్వేస్టేషన్ 1929లో నిజాం ప్రభుత్వం పాలనలో ఏర్పాటైయ్యింది.

# ప్రజల భద్రతకు హైడ్రా పెద్దపీట

**-జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలకు చెక్**
**-మార్చి నెలనుంచి ముమ్మర తనిఖీలు**
**-నిబంధనలు పాటించకపోతే సీజ్**
**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**




సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** నిప్పుతో ఊహించని ముప్పు ఉంటుంది. 30 సెకెండ్ల సమయంలో మంటలు వ్యాపించే పరిస్థితి ఉంది. వచ్చేది వేసవి కాలం.. జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. అగ్నిమాపక నిబంధనలన్నీ తూచా తప్పకుండా అందరూ పాటించాలి. వచ్చేది వేసవి కాలం.. మరింత ప్రమాదం పొంచి ఉంది. నగరంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను పరిశీలిస్తే నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందుకే హైడ్రా అగ్ని ప్రమాదాలపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అవగాహన కార్యక్రమాలను పెద్ద యెత్తున చేస్తూ వస్తోంది అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈమేరకు గురువారం అగ్ని ప్రమాదాలపై పాతబస్తీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జుల్ఫీకర్‌తో కలిసి రంగనాథ్ ప్రసంగించారు. తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో జనవరి నెలాఖరులో తనిఖీలు చేపట్టి 9 షాపులను సీజ్ చేసినట్టు గుర్తు చేశారు. పలు వ్యాపార సంఘాల వినతుల మేరకు ఒక నెల రోజులు సమయం ఇచ్చామని.. మార్చి నెల రెండో వారం నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. నిబంధనలు పాటించకపోతే ఆయా వ్యాపార సముదాయాలను, షాపులను సీజ్ చేస్తామని రంగనాథ్ హెచ్చరించారు.

**వేధించడం కాదు.. జాగ్రత్త పడడం..**

అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా తనిఖీలు చేయడం.. నిబంధనలు పాటించని వ్యాపార సముదాయాలను సీజ్ చేయడాన్ని వేధించడంగా భావించవద్దని.. జాగ్రత్త పడడంగా పరిగణించాలని రంగనాథ్ అన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తమకు సమాచారం ఇవ్వాలని వ్యాపార సంఘాల ప్రతినిధులతో పాటు.. పౌరులను కోరారు. ప్రజల భద్రతకు హైడ్రా పెద్ద పీట వేస్తుందన్నారు. వ్యాపారాలు ప్రశాంతంగా చేసుకోండి.. జాగ్రత్తలు పాటించండి.. మీతో పాటు.. మీ విలువైన వినియోగదారుల భద్రత గురించి ఆలోచించండి చెప్పారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన అగ్ని ప్రమాదాల వీడియోలు, రెస్క్యూ ఆపరేషన్లు, అగ్ని ప్రమాదాలకు గల కారణాలను వివరిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలకు ఎవరు బాధ్యులు అనేది గ్రహించాలని చార్మినార్ ఎంఎల్‌ఏ జుల్ఫికర్ అన్నారు. ప్రమాదాలు జరగక ముందే అప్రమత్తమవ్వాలని సూచించారు. రంజాన్ మాసం వ్యాపారాలు జరుగుతాయి స్టాకును భద్రపరిచినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికి వారు చెక్ చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, విద్యుత్ విభాగం అధికారి ఏవీ రామారావు, సిటీ ప్లానర్ శ్రీనివాస్ రెడ్డి తో పలు విభాగాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్లకు 'అదనపు'బాధ్యతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలోని పలువురు జోనల్ కమిషనర్‌లకు పలు అదనపు కమిష నర్ల బాధ్యతలు ప్రభుత్వం అప్పజెప్పింది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ డా.ప్రియాంక ఆలకు జిహెచ్ఎంసి హెల్త్ విభాగాన్ని అప్పజెప్పింది. అలాగే గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుందరెడ్డికి అడిషనల్ కమిషనర్ (ఎలక్ట్రికల్)బాధ్యతలను అప్పజెప్పింది. అలాగే స్పోర్ట్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.అలివేలు మంగతాయారుకు అదనంగా యుసిడిని అప్పజె ప్పింది. అలాగే ఎస్టేట్‌వింగ్‌ను రెవెన్యూవింగ్‌లో కలిపి ఆబాధ్యతలను అడిషనల్ కమిషనర్ రెవెన్యూకు అప్పజెప్పింది. దీంతో ఎస్టేట్ విభాగానికి సంబంధించిన రికార్డులన్నీ రెవెన్యూ ఆధీనంలోకి రానున్నాయి.

## ఎగ్జిబిషన్ సొసైటికి జాతీయ స్థాయిలో గుర్తింపు




అవార్డులను అందచేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**గోషామహల్,ఫిబ్రవరి 12ప్రభాతవార్త:** అఖిలా భారత పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తున్న 85వ ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాల్స్ నిర్వాహకులకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డులను అందచేశారు.గురువారం గాంధీ సెంటనరీ హాల్ నిర్వహించిన అవార్డ్సు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ సొసైటి ద్వారా నుమాయిస్ అంచెలం చెలుగా అభివృద్ధి చెందుతూ నేడు భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న ఉత్పత్తులను అమ్మకాలు చేయడం ద్వారా సొసైటికి, హైదరాబాద్ నగరానికే గర్వకారణమన్నారు.కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఎంతో మంది వ్యాపారులు ఇక్కడి వస్తారన్నారు.భవిష్యత్తు తరాలకు అందమైన నగరాన్ని ఏర్పాటు కోసం కాంగ్రెస్‌ప్రభుత్వం కృషి చేసేందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళిక రూపొందిండం జరిగిందన్నారు.30వేలమంది విద్యార్థినులకు ఈ సొసైటి ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. నుమాయిష్‌తో వచ్చే ఆదాయంతో పాఠశాల, కళాశాల విద్యసంస్థలను నడువడం గొప్ప విషయమన్నారు.10వేలమంది సొసైటి ద్వారా ఉపాధి పొందుతున్నట్లు వివరించారు. ప్రతియేటా జనవరి మాసంలో జరిగే ఎగ్జిబిషన్ ద్వారా అన్ని కులాలు,మతాలకు చెందిన బడా వ్యాపారులను,చిరువ్యాపారుల వరకు ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు.46 రోజుల పాటు ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.ఎగ్జిబిషన్‌లో రకరకాల వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల విద్యార్థినులకు విద్యా భోదనలను అందిస్తూ సమాజంలో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.కాగా గోల్డ్‌మెడల్స్‌తోపాటు ప్రశంసా పత్రాలను అందచేశారు.నుమాయిస్‌లో సందర్శకులకు ఉత్తమ సేవలు అందించిన స్టాల్స్ నిర్వాహకులు,పోలీసు,ట్రాఫిక్,విద్యుత్,ఆర్.అండ్.బి.ఇతర శాఖల అధికారులు,సిబ్బందికి బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటి కార్యదరి ్శ బి.ఎన్.రాజేశ్వర్,ఉపాధ్యక్షులు ఆర్.సుఖేష్‌రెడ్డి, చంద్రశేఖర్,ఎన్.సంజీవకుమార్,సొసైటి సభ్యులు బి.హన్‌మంత్‌రావు పి.హరినాథ్ రెడ్డి,కన్వీనర్ బి.అనురాధ,బి. ప్రభాశంకర్,ఎన్.వినయ్‌కుమార్,సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాలెంటైన్స్ డే.. వలపు వలలో పడొద్దు!

**-సిపి విసి సజ్జనార్ హెచ్చరిక**

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** "వాలెంటైన్స్ డే అంటే కేవలం గులాబీలే కాదు..ప్రమాద ఘంటికలు కూడా! సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్‌లో మీరు తోడు కోసం వెతుకుతుంటే..సైబర్ కేటుగాళ్లు మీ బ్యాంక్ ఖాతాను ఖాళీ చేయడానికి కాచుకుని ఉంటారు" అంటూ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ హెచ్చరించారు.పరిచయం అయిన వెంటనే 'ఐ లవ్ యూ' చెప్పడం, విదేశాల్లో ఉన్నామంటూ గొప్పలు చెప్పడం, హఠాత్తుగా ఆపద వచ్చిందని నాటకాలాడటం, ఇవన్నీ మిమ్మల్ని బుట్టలో వేసుకునే ఎత్తుగడలే..అంటూ ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'అజ్ఞాత వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు, గిఫ్ట్ కార్డులు పంపొద్దు, వీసా సమస్యలని, ఆసుపత్రి ఖర్చులని, కస్టమ్స్‌లో ఖరీదైన గిఫ్ట్ ఇరుక్కుపోయిందంటూ చెప్పే మాయమాటలు అస్సలు నమ్మొద్దు'..అన్నారు. అనుమానం వస్తే వెంటనే స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో మాట్లాడండి. ప్రేమ కోసం వేచి చూడొచ్చు..కానీ మోసగాళ్ల చేతిలో విలపించొద్దు. జాగ్రత్త! అంటూ సీపీ సజ్జనర్ యువతను అప్రమత్తం చేశారు.

## కళాశాల మూడో అంతస్తు నుండి దూకి విద్యార్థి ఆత్మహత్యయత్నం

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ యంనంపేట్ శ్రీ నిధి ఇంజినీరింగ్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థి ఒకరు కళాశాల మూడో అంతస్తు భవనంపై నుండి కిందికి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ హంటర్ రోడ్డు కాలనీకి చెందిన జి. కల్యాణ్ యంనంపేట్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల ఇంజినీరింగ్ ఎఐ ఫస్టియర్ చదువుతున్నాడు. యంనంపేట్ గ్రామంలోని నిత్యశ్రీ హాస్టల్‌లో నివాసం ఉంటూ ఇంజినీరింగ్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. కళాశాలలో కల్యాణ్ ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో సదరు విద్యార్థి తల్లితండ్రులకు కళాశాల ప్రిన్సిపాల్ సమాచారం ఇవ్వగా విద్యార్థి తల్లి బంధువులతో కలిసి కళాశాలకు వచ్చి విద్యార్థి సమక్షంలోనే ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతోంది. ఇదే సమయంలో బాధిత విద్యార్థి కల్యాణ్ వాష్‌రూంకు వెళ్లివస్తానని చెప్పి కళాశాల మూడో అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకాడు. దీంతో తీవ్రగాయాలు కాగా కళాశాల సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులతో కలిసి జోడిమెట్ల లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. విద్యార్థి పక్కటెముకలు, కాళ్లు పలుచోట్ల విరిగినట్లు పోలీసులు తెలిపారు. మెరుగైన చికిత్స కొరకు బాధితుడ్ని నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ సీఐ రాజు వర్మ తెలిపారు.

# నారాయణగూడ చౌరస్తాలో వామపక్ష పార్టీల నిరసన




నారాయణగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వామ పక్షపార్టీల నేతలు

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కే ంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు గురువారం నారాయణగూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టా రు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ (ఎంఎల్-న్యూడెమ్రోకసీ) అధికార ప్రతినిధి చలపతిరావు, సిపిఐ (ఎంఎల్ మాస్లైన్) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి హమ్మేశ్, సిపిఐ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.మురహరి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, జాన్‌వెస్లీ మాట్లా డుతూ కే ంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను రద్దు చేసేంతవరకు రాజీలేని ఉద్యమం కోససాగిస్తామని హెచ్చరించారు. కార్మిక వర్గం దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నేడు తాము ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఎంతోమంది కార్మికులు తమ రక్తాన్ని చిందించి సాధించిన 29 కార్మిక చట్టాలను కేంద్రం 4 లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిందని, వీటిని రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్మిక వర్గానికి సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును హరిస్తూ యాజమాన్యాలకు బానిసలుగా మార్చే ఈ విధానాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని వారు స్పష్టం చేశారు.

# వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి : విహెచ్ హనుమంతరావు




కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష శిబిరంనుద్దేశించి మాట్లాడుతున్న విహెచ్, చిత్రంలో పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. గురువారం అంబర్ పేట నియోజకవర్గం నల్లకుం ట ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ మాజీ పిసిసి కార్యదర్శి లక్‌పతి యాద గిరిగౌడ్, జ్యోతి యాదగిరిగౌడ్‌ల ఆధ్వర్యంలో సత్యాగ్రహం సత్యాగ్రహ దీక్షను చేపట్టారు.ఈ దీక్షకు హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం దేశంలో పేదలు, గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. యుపిఏ సర్కార్ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ పేదల కోసం పెట్టిన పథకానికి దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న మహాత్మా గాంధీ పేరును పెట్టి చిన్నంగా గౌరవించారని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్దంగా లభించిన అధికారాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ పిసిసి ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్,పార్టీ సీనియర్ నాయకులు ,కోటం అనిల్, గడ్డం శ్రీధర్ గౌడ్,రావుల సుధాకర్,సాయికిరణ్, తిలక్ నగర్ అనిల్ కుమార్, ఫరీద్,జాంగిర్,సునీత రెడ్డి, శాంతమ్మ, ఫాతిమా,అధిక,స్వాతి పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి బివి పట్టాభిరామ్ : సిరికొండ మధుసూదన చారి



గురుబ్రహ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి

**చిక్కడపల్లి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** బహుముఖ ప్రజ్ఞాశాలి బివి పట్టాభిరామ్ అని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలో వంశీ ఆర్ట్ థియే టర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ ఇంద్రజాలికులు జాదురత్న డాక్టర్ బి వి పట్టాభిరామ్ 76వ జయంతి సందర్భంగా మెజీషియన్ డే, గురుబ్రహ్మ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత కళాబ్రహ్మ డాక్టర్ వంశీరామరాజు నిర్వహణలో జరిగింది. ప్రముఖ సాహితి వ్యక్తా డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహ రావు, వాణి ఉప్పుల ( కెనడా), పాత్రికేయులు జీ.వల్లీశ్వర్, జయ పట్టాభిరామ్, మ్యాజిక్ చాప్లిన్ చొక్కాపు వెంకటర మణ, ప్రశాంత్ బావ రాజు, వంశీ సమస్యల మేనేజింగ్ శైలజ సుంకరపల్లి, సుధామయి తదితరులు పాల్గొన్నారు.వ్యక్తిత్వ వికాసం, మనస్తత్వశాస్త్రం , మ్యాజిక్ రంగాలలో ఆయన విశేష కృషి చేసారని అన్నారు. మ్యాజిక్ ద్వారా మూఢనమ్మకాలను పారద్రోల డమే కాకుం డా, లక్షలాది మంది యువతకు బివి పట్టాభిరామ్ స్ఫూర్తినిచ్చారని అన్నారు.చివరగా వంశీ రామరాజు మాట్లాడుతూ పట్టాభిరామ అవార్డును నట కిరీటి రాజేంద్రప్రసాద్ కు ప్రధా నం చేస్తామని కాగా ఫిబ్రవరి 12వ తేదీని మెజీషియన్ డే ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి వి పట్టాభిరామ్ కు ఇంద్రజాల నివాళిగా చుక్కాపు వెంకటరమణ నిర్వహణలో మ్యాజిక్ సర్కరమా పేరుతో ప్రదర్శన నిర్వహించారు.

## గౌసేపాక్ దర్గాలో ఎమ్మెల్యే తలసాని


గౌసేపాక్ దర్గా వద్ద తలసానిని సత్కరించిన నిర్వహకులు.

**బేగంపేట ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**
రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని రాణిగంజ్ సిటీలైట్ చౌరస్తా వద్ద ఉన్న గౌసేపాక్ దర్గాలో గురువారం గ్యార్వీ షరీఫ్ ఫాతిమాను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు.సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రార్ధనల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్,నిర్వహకులు జావీద్,సలీం, శివ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కిషోర్ కుమార్, ఆంజనేయులు, సతీష్, గణేష్, సూరి,అబ్బీ,శివ,వినయ్,శ్రీనివాస్,సెల్వీరాజు,జనార్ధన్‌రాజు,ఉన్నారు.

## రసరంజని మహాపురుషుడు మండలి నాటకం

**: తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ప్రముఖ గాంధీయవాది, రాజకీయ దురంధరుడు, సామాజిక కార్యకర్త, పార్లమెంటు సభ్యుడు, సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతిని పురస్కరించుకొని భారతదేశ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన విశేష సేవలను గుర్తుచేస్తూ రసరంజని హైదరాబాద్ నిర్వహణలో మహాపురుషుడు మండలి నాటకం ప్రదర్శించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి గురువారం తెలిపారు. ఈమేరకు ఆయన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వివరాలను మీడియాకు వెల్లడించారు. డాక్టర్ కె.వి.రమణాచారి ఆధ్వర్యంలో ఈ నెల 18 బుధవారం రాత్రి 6గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ సాహితీవేత్త, ఏపి సాంస్కృతికశాఖ మాజీ డైరెక్టర్ డా. దీర్ఘాసి విజయభాస్కర్ రచన, గంగోత్రి సాయి దర్శకత్వంలో డా. బి.జయప్రకాష్ నాటక పరిచయంలో అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి సమర్పణలో మహాపురుషుడు మండలి నాటకం ప్రదర్శింపబడుతుందని పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల నటులు ఎం.వి.రాజర్షి, జి.వసంత యామిని, గంగోత్రిసాయి, ఎం.రాధ, కె.మధుకర్, బడుగు మోహన్‌రావు, లుక్కా సోమేష్, బివిబివి.రాయుడు, వివి.స్వామి, జివి.రంగారెడ్డి, సూర్యదేవర జగన్నాథరావు, డా. బి.జయప్రకాష్, వివి.నరసింహారావు, గాదె నాగభూషణం తదితరులు నటిస్తున్న ఈ నాటక ప్రదర్శనకు అధికసంఖ్యలో నాటకప్రియులు, మండలి అభిమానులు, రాజకీయవేత్తలు, ఔత్సాహిక ప్రేక్షకులు, యువత విచ్చేసి ఆసాంతం దర్శించి స్ఫూర్తిని పొందాలని డా. కె.వి.రమణాచారి సూచించారు.

## బాధితులు ఆందోళనలు చెందరాదు


సమావేశంలో మాట్లాడుతున్న గిరప్రసాద్‌శర్మ

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్‌నేషనల్ ట్రస్ట్ వల్ల మోసపోయిన 4,200 మంది బాధితులకు కోర్టు తీర్పు రాలేదని, పోలీస్ ఉన్నతాధికారులు బదలీ అయ్యారని ఎవరూ ఆందోళనలు చెందరాదని, ఆత్మహత్యలకు పాల్పడరాదని ఫౌండేషన్ విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ విజ్ఞప్తి చేశారు. ధన్వంతరి ఫౌండేషన్ కేసు రాష్ట్ర హైకోర్టులో కొనసాగి తీర్పు రిజర్వు చేయడం జరిగిందని, త్వరలోనే న్యాయ బద్దంగా తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్‌కు సంబంధించిన కేసును సిసిఎస్ పోలీసు అధికారులు డిసిపి, ఎసిపిలు చాలా చాకచక్యంగా ఛేదించి బాధితులకు న్యాయం జరిగేలా కోర్టులో అన్ని ఆధారాలను సమర్పించడం జరిగిందని, దీంతో హైకోర్టు ఈ కేసు తీర్పును రిజర్వు చేశారని, తీర్పు ఈ నెల 10వ తేదీన వెలువడవలసి ఉందని, కాని కొన్ని కారణాల వల్ల రాలేదని, త్వరలోనే బాధితులకు న్యాయం జరిగేలా తీర్పు వస్తుందన్నారు. మరోక వైపు ఈ కేసును ఛేదించిన పోలీసు ఉన్నతాధికారులు డిసిపి, ఎసిపిలు సిసిఎస్ నుంచి బదిలీ అయ్యారని బాధితులు మధనపడుతూ ఆందోళన చెందుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. బాధితులు ఎవరూ ఆందోళనలు చెందవద్దని, హైకోర్టు తీర్పు బాధితులకు అనుకూలం వస్తుందని ఆయన చెప్పారు. కాగా ఇటీవల సీతామహాలక్ష్మి అనే వృద్దురాలు తీవ్రంగా ఆందోళనలు చెంది మృతి చెందడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బాధితులు, ట్రస్ట్ ప్రతినిధులు రవి కుమార్, రమణమూర్తి, పద్మజా, రాఘవశర్మ పాల్గొన్నారు.

## 14, 15 తేదీలలో సమాజ్ ఆధ్వర్యంలో సదస్సు

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** సజ్జన్ సమాజ్ ఇంటర్‌నేషనల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నైతికత, మానవత్వం, ఐక్యత కోసం సభ్యుల, శ్రేయోభిలాషుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సమాజ్ వ్యవస్థాపకులు ముస్తాఫా అహ్మద్ అభిలాష, డైరెక్టర్ మసూద్ ఆలీఖాన్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 14వ తేదీన తమ సమాజ్ సభ్యుల సమావేశం జరుగుతుందని, 15వ తేదీన 'వసుదైవ కుటుంబం' అనే అంశంపై సదస్సు కొనసాగుతుందని, ఈ సదస్సులో ప్రముఖులు మల్లవరపు బాలలతా, రమణ మూర్తి, బిఆర్ షాఫి, డా.మసూద్ ఇక్బాల్‌జగ్గర్, బి.కె.ఉమారాణి, సయ్యద్ సలార్, ప్రొఫెసర్ ఎం.రాజ్‌కుమార్, బి.ప్రశాంత్, జవహర్, పి.వీరబాబు తదితరులు పాల్గొంటారని వివరించారు.

## బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : సంతోష్ గౌడ్


డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో నగర యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్.

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాల అభివృద్దే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని నగర యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్ తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కార్వాన్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు రావడంతో గురువారం హైదరాబాద్ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నగర యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ గౌడ్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని తెలిపారు. కార్వాన్ నియోజకవర్గంతో పాటు లంగర్ హౌస్ డివిజన్ లోని పలు బస్తీలు, కాలనీలలో నెలకొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలు ఏవైనా తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాటు ప్రజా ప్రతినిధుల దగ్గరికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. లంగర్ హౌస్ డివిజన్ లో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట లబ్ధిదారులు జ్యోతి, ఫాతిమా బేగంలు ఉన్నారు.


కింగ్‌కోఠి ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు


హిమాయత్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల విద్యార్థి సంఘాలు


బాచుపల్లి మండలంలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు, నాయకులు


బోయిన్‌పల్లి మార్కెట్‌లో హమాలీల సమ్మెకు సంఘీ భావం తెలిపిన మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్. చైర్మన్ దేవుడు,ఏఐటీయూసి నేత నర్సింహ్మా తదితరులు


విద్యుత్‌సౌధలో నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు


బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా సమ్మెలో పాల్గొన్న నాయకులు, కార్మికులు


సమ్మెకు మద్దతుగా ఎల్ఐసీ సికింద్రాబాద్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నిరసన సభ


దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న మండల కార్యదర్శి కన్నగారి నర్సింహ్మారెడ్డి ,మాజీ కార్యదర్శి పుస్తకాలు నర్సింగ్ రావు ,పలువురు సిపిఐ నాయకులు, కార్మికులు


నాచారం డివిజన్ పరిధిలో నిర్వహించిన సమ్మెకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న డీజేకేవీ నాయకులు

# విజయవంతంగా దేశవ్యాప్త సమ్మె

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని నిరసిస్తూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మె నగరంలో విజయవంతంగా ముగిసింది.సమ్మెలో పలు కార్మిక సంఘాలు పెద్దఎత్తున పాల్గొని ర్యాలీలు ,నిరసనలు తెలిపారు.


సమ్మెలో పాల్గొన్న విఎస్‌టి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ డి పాల్ ,ఇతర నాయకులు

## నియోజకవర్గంలో 'సమస్యలపై సమరం' : మన్నె గోవర్ధన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గంలో సమస్యలపై సమరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఆరు డివిజన్లలో సమస్యలతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో పారిశుద్య నిర్వహణ, బస్తీ దవాఖానాల బలోపేతం తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ద ఉండేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పారిశుద్యం పడకేసిందని, చెత్త తరలించడానికి రోజుల సమయం పడుతుందన్నారు. ఎక్కడ చెత్త అక్కడే నిలువ ఉంటుందని, ఫలితంగా రోగాలు వ్యాపిస్తున్నాయన్నారు. ఇక వీధిదీపాల సమస్య నెలలు గడుస్తున్నా తీరడం లేదన్నారు. వీధిదీపాలు వెలగడం లేదని, ఫిర్యాదు చేసినా పట్టించుకొనే నాధుడే కరువయ్యాడన్నారు. బస్తీ దవాఖానాలను నిర్వీర్యం చేస్తున్నారని, ఏ కేంద్రంలో సరైన మందులు లేవని, పరీక్షలు సరిగా చేయడం లేదన్నారు. దీంతో పేదలు, స్థానికులు ఎంతగనాట ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని సోమాజీగూడ, వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయన్నారు. కార్పొరేటర్లు ఉన్నా ప్రభుత్వం కనీసం నిధులు విదల్చలేదన్నారు. మేయర్ ఇదే నియోజకవర్గంలో ఉన్నప్పటికి ఏ డివిజన్‌లోనూ కనీస అభివృద్ది లేదన్నారు. దారులన్నీ తవ్వి అలానే వదిలివేస్తున్నారన్నారు. ఈ సమస్యలపై సమరం కొనసాగుతుందని, సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళనను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఫిల్మ్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, నరసింహ్, గజ్జల ఆనంద్, ఎస్కే అహ్మద్, కతాల్, వెంకీ ముదిరాజ్, శ్రీకాంత్, శౌరిరాజు, శ్రీనివాస్, అంజన్‌కుమార్, న్యాయవాది నరసింహ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్‌ను కలెక్టర్ ఉపసంహరించుకోవాలి

**-భారతీయ గోర్ బంజారా పోరాట సమితి డిమాండ్**


అభివాదం చేస్తున్న రవిచందర్ చౌహాన్, మంగీలాల్ నాయక్, బాబునాయక్, సరిత తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్ ను కలెక్టర్ వెంటనే ఉపసంహరించుకోవాలని చట్ట బద్ద పరంగా, న్యాయ వ్యవస్థ పరంగా ఎన్నుకోబడిన సర్పంచిని కలెక్టర్ ఎలా సస్పెండ్ చేస్తారని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వ్యవస్థపాక అధ్యక్షులు రవించందర్ చౌహాన్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మంగీలాల్ నాయక్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మొగిలి తండా సర్పంచ్ శాంతా బాయిని అక్రమంగా సస్పెండ్ చేయడం పూర్తిగా అన్యాయమని, ప్రజాస్వామ్య విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. ఎలాంటి సరైన కారణాలు లేకుండా, సరైన విచారణ లేకుండానే సస్పెన్షన్ విధించడం తండా ప్రజల స్వాభిమానాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై దృష్టి సారించి, మొగిలి తండా సర్పంచ్ శాంతాబాయి పై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తండా ప్రజల హక్కులు, గౌరవం మరియు స్థానిక స్వపరిపాలన పరిరక్షణ కోసం సమితి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు స్పష్టం చేశారు. సర్పంచ్ శాంత భాయ్ మాట్లాడుతూ నేను ఎటువంటి తప్పు చెయ్యకుండానే చెట్టు కొట్టించినందుకు కలెక్టర్ నన్ను సస్పెండ్ చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో బాబు నాయక్, మాజీ ఎంపీటీసీ సరిత, నరియ నాయక్ మాజీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్ వర్ష నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై బిల్లుల బారాన్ని తగ్గించాలి : నాయకులు

**- మంచినీటి బిల్లుల విషయంపై సిఎంను కలుద్దాం**


మంచినీటి బిల్లుల వసూళ్ల విషయంలో జల మండలి అధికారుల నియంతృత్వంపై చర్చిస్తున్న బిజెపి, బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల ప్రజలపై జల మండలి అధికారులు మంచినీటి బిల్లుల భారాన్ని తగ్గించాలని బిజెపి, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మణికొండలో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ప్రజలపై వేసిన నీటి బిల్లుల భారంపై ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లడుతూ జల మండలి అధికారులు ప్రజలకు మెరుగైన నీటి సరఫరా చేయడంను మరిచి ఐదేళ్ల కాలంకు సంబంధించిన బిల్లులు ఒకేసారి చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తీసుకు రావడం దారుణమన్నారు. ఎప్పటి బిల్లులు అప్పుడు కట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని, అరకొర నీటిని సరఫరా చేసి ఇప్పుడు మొత్తం బిల్లులు కట్టాలని, లేని ఎడల నీటి కనెక్షన్లు తొలగిస్తామని ప్రజలను దబాయించడం అన్యాయమన్నారు. జల మండలి అధికారులు ప్రజలకు ఏ నెల ఎంత నీటిని సరఫరా చేశారో సరైన లెక్కా పత్రం లేకుండా, ఒకేసారి వేల రూపాయలు చెల్లించాలని ఆదేశించడం సరైంది కాదన్నారు. రాజ్యాంగ ప్రకారం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులదేనని, ఈ విషయంలో ప్రజలకు మేలు జరిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలుద్దామని నిర్ణయించామన్నారు. త్వరలోనే ప్రజల ఇబ్బందులను, జల మండలి అధికారుల పనితీరును సీఎంను కలిసి వివరించి, పాత బకాయిలన్నీ రద్దు చేయాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బీరప్ప, సిద్దప్ప, ధన్‌రాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావ్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర నారాయణ పన్ దిరి సంపుటి ఆవిష్కరణ


ప్రముఖ జర్నలిస్ట్ హాస్యవధాని శంకర నారాయణ రచించిన పన్ దిరి సంపుటిని ఆవిష్కరిస్తున్న త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి తదితరులు

**చిక్కడపల్లి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ప్రముఖ జర్నలిస్ట్ హాస్యవధాని శంకర నారాయణ రచించిన పన్ దిరి సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు శంకర నారాయణ హాస్యాన్ని జోడించి రాజకీయాలు సామాజిక అంశాలు పై సున్నితం గానే ఆలోచించే రీతిలో రాస్తారు అని చెప్పారు అయన గతం లో రాసిన ఫన్ పరాగ్,పన్ ఛామృతం వంటి రచనలలో వ్యంగ్యం అధిక్షేపం కలసి చదివించే గుణం తో ఉంటాయి అని వివ రించారు ఆయన ప్రముఖ దిన పత్రికలో కాలమిస్ట్ గా కొన్ని సంవత్సరాలు గా ప్రతిభా వంత వ్యాసాలు రాస్తున్నారు అని అభినందించారు పాటల రచయిత స్వర కర్త రాయారావు విశ్వేశ్వర రావు సంపుటిని సమీక్ష చేస్తూ విసుగు ఒత్తిడి తగ్గించేందుకు పన్ దిరి మంచి టానిక్ అన్నారు వంద శాతం నవ్వు నుఈ సంపుటి గ్యారెంటీ గా అందిస్తుంది అని తప్పక చదవండి అని సూచన చేశారు శంకర నారాయణ మాట్లాడుతూ పత్రికల్లో తను రాసిన అంశాలు తదుపరి కాలం లో హాస్యవధానానికి ఉపయోగ పడ్డాయి అని తెలిపారు త్యాగరాయ గానసభ తనకు కళా భూమి అని చెప్పారు గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి వందన సమర్పణ చేశారు

## సమస్యల పరిష్కారానికి కృషి : బద్రి యాదవ్


రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నేత బద్రి నాథ్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా తన వంతు కృషి చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత సి.బద్రినాథ్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మోండా డివిజన్ లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు డి.బాబురావు,రౌతు రాజయ్య, పి.నర్సింగ్ రావ్,అశీర్వాధం, జగన్నాధం, కోటయ్య, రావ ఎక్రిష్ణ, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఏకపక్ష నిర్ణయాలు ప్రభుత్వానికి సరికాదు

**-సైబరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేసే వరకు పోరాటం**
**-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యత వహించాలి**
**- రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి**



**అత్తాపూర్ ఫిబ్రవరి12,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేసి అస్తిత్వాన్ని దెబ్బతిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో తమ ప్రాంతానికి అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను వ్యతిరేకిస్తూ గురువారం అత్తాపూర్‌లో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై మాట్లాడారు... రంగారెడ్డి జిల్లాలోని పలు జిహెచ్ఎంసి సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.మా ప్రజలు కట్టే పన్నులను తీసుకుపోయి హైదరాబాదులోని ఎంఐఎంకు కటిపెట్టే ప్రయత్నం చేస్తుందని నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని శంషాబాద్,రాజేంద్రనగర్ జోన్‌లను సైబరాబాద్ కార్పొరేషన్‌లో కలపాలని డిమాండ్ చేశారు.

**హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనంపై కోర్టుకు వెళ్తాం**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా హైకోర్టుకు వెళ్తామని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు ద్వారా తమ ప్రాంతానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని త్వరలోనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలి**

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తీరుపై బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రకాష్ గౌడ్ అధికార పార్టీలోకి వెళ్ళింది నియోజకవర్గ ప్రయోజనాల కోసమా లేక నష్టం చేయడానికా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సీఎంని కోరినట్లు చెపుతున్నప్పటికీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఎమ్మెల్యే మాట లెక్కచేయడం లేదని అర్థం అవుతుందన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో ఆయనను నిలదీస్తామన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు, మాజీ కోఆప్షన్ సభ్యులు కొలను సుభాష్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు వనం శ్రీరామ్ రెడ్డి, హైదర్గూడా డివిజన్ అధ్యక్షులు శెట్టి గారి నరేంద్రరావు, మైలార్దేవ్ పల్లి డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, మాజీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, నాయకులు నోముల రాము యాదవ్, ఏ రాఘవేందర్ యాదవ్, బండ రాజేష్ యాదవ్, జాలిగం చిత్తారి, బంగి శ్రీనివాస్, పి జీవన్ దాస్, సదాల వెంకట్రెడ్డి, మద్దెల ప్రేమ్ గౌడ్, వీర్లపల్లి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మేడి రమేష్, శ్యామనోహర్ తదితరులు

**హైదరాబాద్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన "సంక్షేమ డైరీ- 2026" ఆవిష్కరణ గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు శ్యాం మనోహర్, సెక్రటరీ జనరల్ మేడి రమేష్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా మంత్రిని సంఘం ప్రతినిధుల బృందం ఘనంగా సన్మానించగా అనంతరం డైరీ, క్యాలెండర్‌ను మంత్రి అడ్లూరి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. సంక్షేమ మంత్రిగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల రాజ్యాంగబద్ధ హక్కుల కోసం తన శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి గార్ల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఆగయ్య, చంద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ కె. రవీందర్, నాలుగు కంపెనీల అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్ బాబు, బీమపల్లీ, ఆనందం, కుమార స్వామి, సత్యనారాయణ, శరబంధ, నాగరాజు, శ్రీహరి, శ్రీనివాస్, కృష్ణ, నరసింహ,బాబు, పవన్ పాల్గొన్నారు.

## స్వామి దయానంద సరస్వతి ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం : బండారు దత్తాత్రేయ


స్వామి దయానంద సరస్వతి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హర్యాన మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి ఫిబ్రవరి 12 ( ప్రభాతవార్త ) :**
భారత సమాజాన్ని అజ్ఞానం నుండి విముక్తి చేసి, జ్ఞాన మార్గంలో నడిపించిన మహానుభావుడు స్వామి దయానంద సరస్వతి అని హర్యాన మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం రామ్ నగర్ లో ఆర్యసమాజ స్థాపకులు, మహోన్నత సంఘ సంస్కర్త స్వామి దయానంద సరస్వతి 202వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ స్వామిజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. "వేదాల వైపు తిరిగి చూడండి" అనే పిలుపుతో సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపారని, మహిళా విద్య, సామాజిక సమానత్వం, జాతీయ చైతన్యం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనదని కొనియాడారు. దేశభక్తి, ధర్మం, నైతిక విలువలను ప్రజల్లో నాటిన స్వామిజీ ఆశయాలను నేటి యువత ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. "స్వామి దయానంద సరస్వతి గారి జీవితం మనందరికీ ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యసమాజ ప్రతినిధులు, ప్రముఖులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ స్నాచింగ్ నిందితుడి అరెస్ట్ ..నగదు స్వాధీనం


దొంగ నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**గోషామహల్,ఫిబ్రవరి 12ప్రభాతవార్త:** గత కొంత కాలంగా సెల్‌ఫోన్లు దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు కుల్సుంపురా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితుడు నుండి సెల్‌ఫోన్లతోపాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డి.సి.పి.జి.చంద్రమోహన్ తెలిపారు.పాత బస్తీ భవానీనగర్‌కు చెందిన సయ్యద్ పక్రూ అలియాస్ అర్బాజ్(23) బహుదూర్‌పురాలో పాత టైర్ల షాపులో పనిచేస్తున్నట్లు తెలిపారు.ఇతనిపై గతంలో భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం,ఆయుధాల చట్టం కింద కేసులు నమోదై ఉన్నట్లు చెప్పారు.గత ఏడాది డిసెంబర్ 16న ఫిర్యాదు దారుడు తన స్నేహితులతో కలిసి జియాగూడలోని పీలామండపం వద్ద మాట్లాడుతుండగా,నిందితుడు అర్బాజ్ తన స్నేహితుడు ఇంతియాజ్‌తో కలిసిహోండా యాక్టివాపై అక్కడకు చేరుకున్నట్లు తెలిపారు.ఫోన్ వాడుతున్న బాధితుడిని గమనించిననిందితులు ,వేగంగా వాహనాన్ని దగ్గరకు తీసువెళ్లి చేతిలోనని ఫోన్ లాక్కుని పరారయ్యారు.ఆ ఫోన్‌ను విక్రయించగా వచ్చిన డబ్బులో అర్బాజ్ తన వాటాగా 2500రూపాయలు తీసుకున్నాడు. పోలీసుల దర్యాప్తు ఈకేసులో ఇప్పటికే మొహమ్మద్ ఇంతియాజ్ ఎలియాస్ షూటర్ షేక్ హాజీలుజైల్‌లో ఉండగా,పరారీలో ఉన్న అర్బాజ్‌ను క్రైం టిమ్ నిన్న పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుండి రెండు వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడి కలీమ్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. కేసును చేధించి నిందితుడిని అరెస్ట్ చేసిన కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు,డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున,క్రైమ్ టీమ్‌ను డి.సి.పి.చంద్రమోహన్ అభినందించారు.ఈ కేసును అడిషనల్ డి.సి.పి కృష్ణగౌడ్,గోషామహల్ ఏ.సి.పి సుదర్శన్ పర్యవేక్షణలో కొనసాగిందన్నారు.

## విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎమ్మెల్యే


విద్యాశాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు కార్పోరేట్ పాఠశాలకు దీటుగా మెరుగైన విద్యా,మౌళిక వసతులు కల్పించేందుకు విద్యా శాఖ అధికారులు,ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచించారు. బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడానికి నిధులను విడుదల చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని నిధులైన వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గానికి విద్యాభివృద్ధి కోసం 3 కోట్ల రూపాయలు ప్రభుత్వం నిధుల విడుదలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందు వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ డిప్యూటీ డిఈఓ బాలు నాయక్, డిప్యూటీ ఐఒఎస్‌లు ప్రసన్న, వీరలక్ష్మి, సంతోషంలతో పాటు 60 ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న భారీ గుంత మరమ్మతు పనులు

**-పరిశీలించిన ఎమ్మెల్యే బలాల, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి**



భారీ గుంత మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** న్యూ మలక్ పేట్ రోడ్డులో భారీ గుంత ఏర్పడడంతో వేగవంతంగా మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయి. న్యూ మలక్ పేట లాలాజార్ హోటల్ సమీపంలో బుధవారం సాయంత్రం రోడ్డు మధ్య భాగంలో అకస్మాత్తుగా భారీగుంత ఏర్పడిన సంగతి విదితమే. ఈ సంఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. భారీ గుంత ఏర్పడడంతో సంబంధిత అధికారులు ఎర్త్ వర్క్ తవ్వకాలు ప్రారంభించి రోడ్డు మరమ్మత్తు పనులను వేగవంతం చేశారు. గురువారం మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల , చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి సంఘటన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. రహదారి పునరుద్ధరణ పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే బలాల మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బలాలకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ, అధికారులు వేణు గోపాల్, మహేష్, నాయకులు అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

**: చైర్మన్ బాబు శ్రీనివాస్**



శ్రీ పోచమ్మ దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్ ను సన్మానిస్తున్న సాయిబాబా దేవాలయం చైర్మన్ రామ్ కోటేశ్వరరావు తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని దేవాలయం నూతన కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట మున్సిపల్ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ పోచమ్మ దేవాలయం నూతన కమిటీ చైర్మన్ గా నియమితులైన బాబు శ్రీనివాస్ ను శిరిడి సాయిబాబా టెంపుల్ చైర్మన్ రామ్ కోటేశ్వర రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో చెగిరెడ్డి మదన్మోహన్ రెడ్డి, చౌకి రవికుమార్, అశోక్ కుమార్, ద్వారక ముఖ్య, ప్రాన్ పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డికి కాలనీవాసుల సన్మానం



మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న ఎస్.కే. డి.నగర్ కాలనీవాసులు

**వనస్థలిపురం. ఫిబ్రవరి. 12. ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డి నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి మరియు అభివృద్ధికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సహకరించినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కార్పొరేటర్ గా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మరియు కాలనీలో అభివృద్ధికి నిరంతరం కృషి చేసినందుకు మరియు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, రఘురాం నేత, ఈర్లపల్లి వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, ఎరువ వెంకటరెడ్డి, చక్రధర్ రావు, పి వెంకట్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, మంద ప్రభాకర్, గోపాల్ రావు, రాజగోపాల్ రావు, సుబ్బారావు, కాంతారావు, శంకరన్న, వెంకట హరి, భరత్లాల్ నాయక్, మరియు శీరిడీ నగర్ వాసులు తదితరులు ఉన్నారు.

## సులోచనకు మాజీ గవర్నర్ నివాళి



సులోచన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ మాతృమూర్తి నాయకోటి సులోచన దశదిన కర్మ కార్యక్రమానికి హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై నాయకోటి సులోచన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానందగుప్తా, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, రంగనరసింహగుప్త, చింతల సురేందర్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, దాసరి మల్లేశం, పోల్కం లక్ష్మీనారాయణ, ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, రాజుశ్రీవాత్సవ, లింగాల కిషోర్ గౌడ్, వజీర్ కుమార్‌గౌడ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



బాలాపూర్ డివిజన్‌లోని వెంకటాపూర్-కొత్తపేట్ గ్రామాల సమీపంలోనున్న పురాతన ప్రసన్నాంజనేయ స్వామి సమేత శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవానికి హాజరై పూజలు చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనాయకురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో జెనిగె భారతమ్మ కొమురయ్య యాదవ్, సిల్వేరి సాంబశివ, దండు గణేష్ ముదిరాజ్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు



తుర్కయంజాల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ నాయకులు



మల్కాజిగిరిలో సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

**తుర్కయంజాల్ ఫిబ్రవరి12, ప్రభాతవార్త :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త 4 లేబర్ కోడ్‌లు కార్మికుల శ్రమశక్తిని నిలువునా దోపిడీ చేసే సాధనాలుగా మారాయని సీఐటీయూ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, ఏఐటీయూసీ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి ఒరుగంటి యాదయ్య ధ్వజమెత్తారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం తుర్కయంజాల్ చౌరస్తాలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ సంయుక్త ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పి శివ కుమార్, సత్యనారాయణ లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి. కిషన్, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు శివ ప్రసాద్, మాల్యాద్రి, శంకరయ్య, రోజా, భాస్కర్ సైదమ్మ నాగేశ్వర్, సుందరమ్మ, పిల్లి కృష్ణ, రాఘవేందర్, శివ, పగిళ్ల మధు ,ఐతరాజ్ కృష్ణ, సత్యం నరసింహ, మధ్యల యాదయ్య, వెంకటకృష్ణ, రైతు సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మేతరి దాసు, అండాలు, రవి, మహేష్, ఆటో యూనియన్ నాయకులు వెంకటయ్య, సతీష్, శేఖర్ గౌడ్, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు, మున్సిపాలిటీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, వివిధ కంపెనీల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తక్షణమే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు

**మల్కాజిగిరిలో**

**నేరేడ్ మెట్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా, కార్మిక-కర్షక-శ్రమజీవుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా మల్కాజిగిరిలో సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించిన నాయకులు, మల్కాజిగిరి చౌరస్తా వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కోమటి రవి, మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్, సీపీఐ మండల కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు సంయుక్తంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బి. యాదగిరి, ఎస్.కే. అజీజ్, సయ్యద్ యూసఫ్, జె. వెంకటరమణ, విజయ్ కుమార్, కె. యాదగిరి, సట్ల ప్రభాకర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు జీడి నవీన్ గౌడ్, టీడీపీ నాయకులు వగ్గు చంద్రశేఖర్, కరణం గోపి, బీఎస్పీ నాయకుడు గౌతమ్ రాజ్ హాజరై మద్దతు తెలిపారు. మహిళలు పాల్గొన్నారు.

**సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ**

**హయత్ నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలన్న డిమాండ్‌తో గురువారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా 400 మంది కార్యకర్తలు రావి నారాయణ రెడ్డి ఫేజ్ 2 నుండి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు బైక్ ర్యాలీ, అనంతరం విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హరి సింగ్ నాయక్, పబ్బతి లక్ష్మణ్, కేతారాజు నర్సింహ, దాసరి ప్రసాద్, అరుణ, పొన్నాల యాదగిరి, సైదులు పాల్గొన్నారు.

## మార్కెట్లను ఆధునీకరించడానికి కృషి : ఇన్‌చార్జి ఎస్‌జిఎస్ చిలక నర్సింహారెడ్డి



మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి లకు అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీని అందజేస్తున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకా నరసింహారెడ్డి

**మలక్ పేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్నింటిని అభివృద్ధి పరిచి ఆధునికరించడానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫూల్ అడిషనల్ చార్జ్ ఎస్జిఎస్, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో దొంగతనాల నివారణ కోసం, సిసి కెమెరాల ఏర్పాటు చేయడం నిమిత్తం మార్కెట్ కు విచ్చేసిన మలక్ పేట్ ఏసీపీ సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి లతో చిలక నరసింహారెడ్డి భేటీ అయి పలు అంశాల గురించి చర్చించారు. అదే విధంగా అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీ ని చిలకా నరసింహారెడ్డి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వారికి వివరించారు. ప్రముఖ మార్కెట్లలో ఒకటిగా పేరుగాంచిన మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు తాము పండించిన మిర్చి, ఉల్లిపాయలు, చింతపండు తదితర వాటిని విక్రయించడానికి తీసుకురావడం జరుగుతుందని, మార్కెట్టుకు వచ్చిన సరుకు చోరీకి గురికాకుండా ఉండడం కోసం పోలీస్ పెట్రోలింగ్ కొనసాగించాలని పేర్కొన్నారు. మలక్ పేట ఎసిపి సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి లు మాట్లాడుతూ వ్యాపారస్తులు కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల ప్రాధాన్యత గురించి వివరించారు. మార్కెట్లో దొంగతనాలు జరుగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు కల్పిస్తామని పేర్కొన్నారు.

## పటాన్ బస్తీ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన నెమలి అనిల్ కుమార్



స్థానికులతో సమస్యలను తెలుసుకుంటున్న నెమలి అనిల్

**నాచారం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పటాన్ బస్తీ గత దశాబ్దంగా అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ చొరవతో సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, తాగునీటి సరఫరా లేకపోవడం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలతో బస్తీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన నెమలి అనిల్ కుమార్ తన బస్తీబాట పర్యటనలో భాగంగా పటాన్ బస్తీని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్థానికులు వివరించిన సమస్యలపై వెంటనే స్పందించిన ఆయన సీఎం రేవంత్ రెడ్డి సహకారం, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి సమన్వయంతో పరిష్కార చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం, తాగునీటి సరఫరా మెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పన దిశగా ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతగా పటాన్ బస్తీ వాసులు నెమలి అనిల్ కుమార్‌ను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజల సమస్యలే నా రాజకీయ అజెండా. బస్తీల అభివృద్ధే నా లక్ష్యం, ప్రజల కోసం నా పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, సురేష్ గౌడ్, మహిళా నాయకురాళ్లు ఇష్రాత్ బానో, ఇంతియాజ్ బేగం, అలాగే బస్తీ వాసులు హైదర్ భాయ్, రెహ్మాన్ అలీ, అర్షద్, ఇబ్రహీం, అలీం, షరీఫ్ భాయ్, మొయిన్, బాబు, సురేష్, నసీం, నజీమ్, పర్వీన్, నదీమ్ భాయ్, షహీన్ బేగం, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

**-బిజెపి నేత చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి డిమాండ్**



రంగారెడ్డి జిల్లాలోని కొత్త డివిజన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** జిల్లాలు, జిహెచ్ఎంసి పునర్విభజనల వల్ల కుదేలై రంగారెడ్డి జిల్లా అస్తిత్వం.. పూర్వ వైభవం కోల్పోతున్న తరుణంలో రంగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఆర్ఎంసి)ను ఏర్పాటు చేయాలని బడంగ్‌పేట్ పాత మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 45 డివిజన్లు ఉన్న ఎల్‌బినగర్ జోన్, 17 డివిజన్లు ఉన్న శంషాబాద్ జోన్, 4 డివిజన్లు కలిగిన రాజేంద్రనగర్ సర్కిల్‌ను కలిపి రంగారెడ్డి పేరిట కొత్తగా మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గురువారం నాదర్‌గుల్‌లోని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి కేంద్ర కార్యాలయంలో ఆయన పలువురు పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ మణిహారంగా భాసిల్లిన రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని ప్రభుత్వ పాలకులు దెబ్బతీశారని ఆందోళన వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి పునర్విభజన పేరిట కొత్తగా రెండు కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రంగారెడ్డి జిల్లా కిందకు వచ్చే పలు డివిజన్లను అందులో విలీనం చేశారని వివరించారు. ఇక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకోకుండా కనీసం స్వంత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోకుండానే ఏకపక్షంగా ఎల్‌బినగర్, శంషాబాద్ జోన్లను, రాజేంద్రనగర్ సర్కిల్‌ను జిహెచ్ఎంసిలో విలీనం చేశారని ఆయన అన్నారు. పాతబస్తీ ప్రాంతాలతో కూడిన జిహెచ్ఎంసిలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన డివిజన్లను విలీనం చేయడాన్ని బిజెపి వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా అస్తిత్వ పరిరక్షణ పూర్వ వైభవం కోసం జిల్లా పేరు శాశ్వతంగా ఉండేందుకు బిజెపి రంగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటును డిమాండ్ చేస్తున్నదని ఆయన వెల్లడించారు. జెండా లు పక్కన బెట్టి రంగారెడ్డి జిల్లా పరిరక్షణే ఎజెండాగా ప్రత్యే క కార్పొరేషన్ పేరిట అందరినీ కలుపుకొని మహోద్యమం ద్వారా ముందుకు పోతామని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, ఏనుగు రాంరెడ్డి, గూడెపు ఇంద్రసేన, తోట శ్రీధర్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి : తీగల మోనారెడ్డి



మీర్‌పేట్ టిఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రాధాన్యత నివ్వాలని మీర్‌పేట్‌లోని టిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ తీగల మోనా నితీష్‌రెడ్డి సూచించారు. టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో గురువారం కాలేజీకి చెందిన సిఎస్ఇ, ఐటి మూడవ సంవత్సరం విద్యార్థుల కోసం ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమాలను పర్యవేక్షించిన కాలేజీ కార్యదర్శి మోనారెడ్డి విద్యార్థులకు దిశా నిర్దేశనం చేశారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతిభకే అవకాశాలు వస్తాయనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని అన్నారు. పోటీ పరీక్షలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లలో నెగ్గుకురావాలంటే అవసరమైన అంశాల్లో నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్‌పై పట్టు ఎంతో అవసరమనీ నిరంతర సాధన, సరైన రీతిలో ఆలోచనా దృక్పథంతో ముందుకు సాగడం ద్వారా సాధించుకోవచ్చని ఆమె వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక వైపు చదువుతూనే మరో వైపు నైపుణ్యాలను డెవలప్ చేసుకోవాలన్నారు. టాస్క్ వంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా ఈ శిక్షణా తరగతులకు విద్యార్థుల నుండి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు బి.భార్గవితో పాటు హెచ్ఓడిలు, పాల్గొన్నారు.

## మల్కాజిగిరి కమిషనర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన వినయ్ కృష్ణారెడ్డిని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు, ఉప్పల్ రైతులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కమిషనర్ వినయ్ కుమార్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో ఎంఎంసి పరిధిలో పరిపాలన మరింత ప్రభావవంతంగా సాగుతుందన్నారు. ప్రజల సంక్షేమానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలలో కమిషనర్ మరిన్ని విజయాలు సాధించాలని అకాక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుబ్బ నరసింహారెడ్డి, సల్ల వీరారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు అరటికాయల భాస్కర్, బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు, సాయిజెన్ శేఖర్, మేకల మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుక్క కిరణ్, కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు శాశ్వత పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న పున్న గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కాలనీ ప్రజల ఇబ్బందిగా తొలగిస్తూ శాశ్వత పరిష్కారం దిశగా పనులు జరుగుతున్నాయని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. శ్రీరామకృష్ణాపురం డివిజన్ విజయపురి కాలనీరోడ్ నెంబర్ 2లో జరుగుతున్న రెయిన్ వాటర్ పైపులైన్ పనులను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. స్ట్రీట్స్ 1,2,3,4,5 ల నుండి డ్రైనేజ్‌పైప్, త్రాగునీరు లైన్ గురించి జలమండలి అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయం చేసుకొని రోడ్ 2లో శాశ్వతంగా పరిష్కరించే విధంగా చేయాలని అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర(హైటెక్ రాము), మహేందర్, సూర్య ప్రకాశ్, అనూదు కుమార్, రాము, శేషగిరిరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు

**-అక్రమాలు కూల్చివేత..**



**తుర్కయంజాల్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త** జి.హెచ్.ఎం.సి శంషాబాద్ జోన్, ఆదిబట్ల సర్కిల్ 15, తొర్రూరు డివిజన్ పరిధిలో ని మునగనూర్ సర్వే నెం : 44 ప్రభుత్వ స్థలమును ఆక్రమించి నిర్మించిన నిర్మాణము ను అధికారులు కూల్చివేశారు. అనంతరం వారు అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే, పార్క్ స్థలములు కూడా కబ్జా చేస్తే, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్మెట్ మండల్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు

**రూ.3 కోట్లలో ఇందిరానగర్‌లో కమ్యూనిటిహాల్ : బన్నాల గీత**

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో రూ.3 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ కమ్యూనిటిహాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు అయినట్లు మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తెలిపారు. ఈ మేరకు పలువురు కాలనీ నేతలతో కలిసి ఆమె మాట్లాడుతూ ఇందిరా నగర్‌లో సుమారు 400 గజాల స్థలంలో కమ్యూనిటిహాల్ నిర్మించేందుకు స్టాడింగ్ కమిటి సమావేశంలో ఆమోదం లభించిందని తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి మల్లికార్జున్, బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్న కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం

**సైదాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** స్వయంభు శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని మూడు శివాలయాలు మహాశివరాత్రి పర్వదినోత్సవానికి సిద్ధమవుతున్నాయి. దేవాలయాలను ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేస్తున్నారు. ఆదివారం శివరాత్రి రోజు ఉదయం 5.30 నుండి రుద్రాభిషేకములు, అర్చనలు నిర్వహిస్తారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు, భరతనాట్యము, కూచిపూడి నృత్యం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మహా శివరాత్రి రోజు 50వేలకు పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో దర్శన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు కార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని దేవాలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు. ఉపవాసంఉండే భక్తులకు దేవస్థానం తరపున ఉచిత తీర్థప్రసాద వితరణతో పాటు పండ్లు, పాలు, మజ్జిగ అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి ఏర్పాట్ల గురించి ఈఓ లావణ్య గురువారం దేవాలయంలో ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పూల నాగరాజు, ఎనుముల రవీందర్‌రెడ్డి, తోకటి కిరణ్ కుమార్, దిండు ప్రవీణ్‌గౌడ్, నారాయణ దుర్గారెడ్డి, కె.కవిత, ఒరుగంటి నరేష్, బండిగారి శ్రీనివాస్‌గౌడ్, యం.రాజేశ్వరి పాల్గొన్నారు.

## భరత్‌నగర్‌లో ఘనంగా నింబవృక్ష కల్యాణోత్సవం



ఉప్పల్ భరత్‌నగర్‌లో నింబవృక్ష కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అన్య బాలకృష్ణ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఉప్పల్ న్యూ భరత్ నగర్ కాలనీలో గురువారం బిఆర్ఎస్ సీనియర్ నేత అన్య బాలకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో నింబవృక్ష కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి కాలనీలో నింబవృక్ష కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉప్పల్ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణాల మధ్య వేడుకలు జరిగా యి. అనంతరం అన్నదానం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి జయంతి వేడుకలు**



ఉప్పల్‌లో జరిగిన వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పి.జితేందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి జయంతి సందర్భంగా ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉప్పల్‌లో బిఆర్ఎస్ సీనియర్ నేత పూదూరి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలు సందర్శించి వైద్య శిబిరంలో పరీక్షలు పరిశీలించారు. చిలుకానగర్‌లో బిఆర్ఎస్ సీనియర్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. రామంతాపూర్‌లో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను కొనియాడారు. బండారి రాజిరెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్లకు నిధులు మంజూరు చేయాలని వినతి



కెఎల్ఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న నవారు మల్లారెడ్డి, వెంకటేశ్వర కాలనీ ప్రతినిధులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని అల్మాస్‌గూడ వెంకటేశ్వర కాలనీలో అంతర్గత సిసి రోడ్లకు నిధులు మంజూరు చేయించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. గురువారం ఆయన కాలనీ అధ్యక్షుడు ఇ.మధుసూదన్‌రెడ్డి, కార్యవర్గ ప్రతినిధులతో కెఎల్ఆర్‌ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో అంతర్గత రోడ్ల దుస్థితిని వివరించి స్థానికుల సౌకర్యార్థం సంక్షేమ సంఘం వినతి మేరకు రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కెఎల్ఆర్ రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుతో సంప్రదించి నిధులు మంజూరయ్యే విధంగా సహకరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు, దయాకర్‌రెడ్డి, శ్రీనాథ్‌చారి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.